క్లుప్తంగా

ఈమని ఎస్సీ కాలనీ గ్రౌండ్ మెరకకు చర్యలు



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): మండల పరిధిలోని ఈమనిలో ఎస్సీ కాలనీలో అందరూ వినియోగించుకునే విధంగా 40 సెంట్ల స్థలం ఉంది. వర్షాకాలం వస్తే చెరువును తలపిస్తూ నీరు నిల్వ ఉండి ఉపయోగం లేకుండా ఉండడంతో స్థానికులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి మెరక తోలించాలంటూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన తన సొంత నిధులతో శుక్రవారం నుంచి మెరక పనులు చేపట్టారు.

పంచాయతీ ఆస్తిని ఆక్రమిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి



కంతేరు(తాడికొండ): గ్రామంలో గిలకల బావికి చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రమేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీకి పూర్వీకులు రాసిచ్చిన ఆస్తిని వారసుల పేరుతో నేడు ఆక్రమించి నిర్మాణం చేసేందుకు పనులు చేస్తున్నారని, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కర్రి రవిపాల్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గద్దె రూబేన్, కర్రి సాంబయ్య, వాసుమల్లి బాబూరావు, కర్రి విశ్వేశ్వరరావు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం



మండడం(తాడికొండ): తుళ్లూరు మండలం మండడం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆశీర్వచనాలు, మంత్రాల నడుమ పలువురు గ్రామస్తులు పాల్గొని నవధాన్యాలు వేసి శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్నారు.

ఓటరు నమోదు, మార్పులపై బీఎల్‌వోలు దృష్టి సారించాలి



తాడికొండ: ఓటరు నమోదు, మార్పులపై బీఎల్ఓలు దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తుళ్లూరు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు సూచించారు. శుక్రవారం తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్ఓల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా మండలంలో ఓటర్ల చేరిక, మార్పులకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు అందాయి అనే దానిపై ఆరా తీసి పెండింగ్‌లు లేకుండా సత్వరమే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫారం 6బీ దరఖాస్తుల స్వీకరణ, ఫారం 6,7,8 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసే ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలి



మంగళగిరి: అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ వి.శ్రీనివాసరెడ్డి సూచించారు. నగర పరిధిలోని ఆత్మకూరు గణపతినగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ హెల్త్ సెంటర్ సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక పరికరాలు ఉపయోగించే విధానంపై వివరించారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ జిల్లా నాణ్యత ప్రమాణాల అధికారి ఎం.వాసుదేవరాజు, హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి పి.అనూష, సూపర్‌వైజర్ జయలక్ష్మి, అగ్నిమాపక సిబ్బంది పి.శ్రీకాంత్‌రెడ్డి, సీహెచ్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి

వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్



సమావేశంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ కృష్ణా, గుంటూరు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): ప్రభుత్వ పథకాలపై వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ కృష్ణా, గుంటూరు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. కుల, మత, పార్టీ, ప్రాంత బేధాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలనేదే ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. వలంటీర్లు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, కందుల రవీంద్రనాథ్ రెడ్డి, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ పాల్గొన్నారు.

భూమికి అపరాల సాగు మేలు

శాస్త్రవేత్త డాక్టర్ రాజమణి



మాట్లాడుతున్న లాంఫాం అపరాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజమణి

పెదపరిమి(తాడికొండ): నేల సహజ స్వభావం కోల్పోకుండా ఉండేందుకు అపరాల సాగు తప్పనిసరి అని లాం వ్యవసాయ పరిశోధనా స్థానం అపరాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజమణి అన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామ రైతు భరోసా కేంద్రంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులు తమ వ్యవసాయ భూమిలో కొంత మేరకైనా అపరాల పంటలు సాగుచేసుకోవాలని, తద్వారా నేల స్వభావం నత్రజని స్థిరీకరణతో మెరుగుపడుతుందని సూచించారు. శాస్త్రవేత్త వెంకట్రావు మాట్లాడుతూ అపరాల పంటల సాగు వివిధ రకాల మినుము ఆయా రకాల సాగు విధానాన్ని వివరించారు. 2023 సంవత్సరాన్ని ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా నిర్ణయించినందున ఉన్న వసతులన బట్టి రైతులు కొంతమేరకైనా సజ్జ, రాగి, అరికెలు, కొర్రలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సతీష్, డాక్టర్ రత్నం, వ్యవసాయాధికారిణి శ్రీ రంజని పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు పూర్తి వైద్యం

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. శుక్రవారం తాడికొండ మండలం పాములపాడులో ఫ్యామిలీ డాక్టర్ డ్రైవ్‌ను ఆమె పరిశీలించి, వైద్య బృందంతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు టెలీమెడిసిన్ ద్వారా అవసరమైన మేరకు వైద్య సహాయం అందించాలని సూచించారు. గ్రామాన్ని సందర్శించే ముందురోజు సీహెచ్ఓ, ఏఎస్ఎం, ఆశ వర్కర్లు రోగులను గుర్తించి ఆసుపత్రికి తీసుకొచ్చేలా చూడాలన్నారు. రోగులకు సూచనలు అందజేసి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపించడంతో పాటు చికిత్స అనంతరం తిరిగివచ్చిన రోగుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులందరికీ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంత పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. సుందరయ్యనగర్, మహానాడు కరకట్ట, మహానాడు సబ్‌స్టేషన్ నుంచి మణిపాల్ హాస్పిటల్ వరకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

మంగళగిరిలో..

మంగళగిరి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోత ఉంటుందని చెప్పారు. నగరంలోని గౌతమబుద్ధా పడమర భాగం నిడమర్రు రోడ్డు వద్ద నుంచి రాజీవ్ గృహకల్ప వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఇప్పటంలో అభివృద్ధి పనులు

- 14 మీటర్ల వెడల్పున రహదారి నిర్మాణం
- సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు



ఇప్పటంలో అభివృద్ధి పనులకు మార్కింగ్ చేస్తున్న డి.ఇ. కృష్ణారెడ్డి తదితరులు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో ముఖ్యమంత్రి కేటాయించిన స్పెషల్ గ్రాంట్‌తో పనులు ప్రారంభించేందుకు కార్పొరేషన్ అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఇప్పటంలో గతంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ప్రహరీ తొలగించారు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు డీఈ కృష్ణారెడ్డి తన సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థను అభివృద్ధి చేసేందుకు రూ.130 కోట్లు కేటాయించారని, ఎమ్మెల్యే ఆర్కే సమక్షంలో ఎక్కడెక్కడ ఏఏ పనులు చేయాలో ముందుగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని చెప్పారు. ఇప్పటానికి స్పెషల్ గ్రాంట్ నుంచి సుమారు 6 కోట్ల రూపాయలు కేటాయించారని, దానిలో సుమారు కోటి 60 లక్షల రూపాయలతో 14 మీటర్ల వెడల్పు 600 మీటర్ల పొడవుతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నాము. ఆ రోడ్డు నిర్మాణ పనులను చేసేందుకు మార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఏప్రిల్ 5న ఢిల్లీలో ధర్నా

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాకు అందరూ కలసి రావాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక అంజుమన్‌షాది ఖానాలో సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్ కంటే 33 శాతం నిధులు తగ్గించారని, పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. జనాభాలో 16 శాతగా ఉన్న షెడ్యూల్ కులాల వారికి 3.5 శాతం, 8.6 శాతంగా ఉన్న గిరిజనులకు 2.7 శాతం మాత్రమే బడ్జెట్‌లో నిధులు కేటాయించడం దారుణమని అన్నారు. ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ మహానగరంలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లి వారినికి చైతన్యవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.దుర్గారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, కౌలు రైతు సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి ఎం. నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, సీఐటీయూ కార్యదర్శి గొర్రెపాటి శ్రీనివాసరావు, నాయకులు వి.సాంబశివరావు, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని జగనన్న కాలనీలోని రోడ్డుకు ఇరువైపులా శుక్రవారం వీధిదీపాలు ఏర్పాటు చేశారు. వాటిని గ్రామ సర్పంచి జి.నాగమల్లేశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఐలా.సీతారామిరెడ్డి, కె.అప్పిరెడ్డి, వెంకట్రావు, విద్యుత్‌శాఖ ఏఈ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు అన్నారు. మండలంలోని మేరికపూడిలో ఫ్రైడే-డ్రైడేలో భాగంగా ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి నీటి తొట్లు, మురుగు కాలువలు పరిశీలించారు. నీటి తొట్లు ప్రతి వారానికి ఒకసారి శుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. కొబ్బరికాయలు, పాత టైర్లు వంటివాటిలో నీరు నిలిచి ఉండకుండా చూడాలని చెప్పారు.

అభివృద్ధి పనులు పరిశీలన



ఉండవల్లి అద్దేపల్లి వారి వీధిలో నిర్మించిన గ్రావెల్ రోడ్‌ను పరిశీలిస్తున్న ఏఈ కిషోర్

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి అద్దేపల్లి వారి వీధిలో నూతనంగా నిర్మించిన గ్రావెల్ రోడ్‌ను కార్పొరేషన్ ఏఈ కిషోర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ మంగళగిరి పాత జాతీయ రహదారి వెంబడి 40 ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని ఈ రహదారి నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆర్కేకు వినతిపత్రం అందజేశారని, వెంటనే స్పందించిన ఆయన రోడ్డును నిర్మించాలని సూచించినట్లు చెప్పారు. జాతీయ రహదారి నుంచి 600 మీటర్ల పొడవను 4 నుండి 5 అడుగుల ఎత్తులో ఈ రహదారి పనులు పూర్తిచేశామని అన్నారు. అద్దేపల్లి వారి వీధిలో కార్పొరేషన్‌కు సంబంధించిన 13 సెంట్ల స్థలం ఉందని, దానిలో కూడా గ్రావెల్ ఫిల్లింగ్ చేసేందుకు అనుమతులు తీసుకుంటున్నామని, దానిని పరిశీలించేందుకు ఇంజనీరింగ్ సిబ్బంది సాయితేజ, సందీప్, మరియు సచివాలయ సర్వేయర్లతో స్థలం కొలతలను నిర్వహించినట్లు చెప్పారు.

బాలకృష్ణ స్వామి ఆలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ జంగా

పాములపాడు(తాడికొండ): గ్రామంలో వెన్నముద్ద బాలకృష్ణస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తూ ముందుకెళ్లడం అభినందనీయమని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బిక్కి శివరామకృష్ణ, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు, స్థానిక నాయకులు పరుచూరి నారాయణ, పసుపులేటి వెంకట్రావు, ఎస్. శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): మండల పరిధిలో డాక్టర్ కొత్త రఘురామయ్య డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని దుగ్గిరాల దోస్త్ కార్యదర్శి గద్దె శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని అన్నారు. రక్తదానం చేయడం వల్ల మన ఇంట్లో కొత్తరక్తం ఉత్పత్తి అయిన ఉత్సాహంగా ఉంటామని వివరించారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. గిరిధరరావు, వై.పూర్ణచంద్రరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో పోటీ చేస్తాం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు



ర్యాలీలో పాల్గొన్న కేసన శంకరరావు, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కమల

మంగళగిరి: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తామని, ఈలోగా పార్టీని ప్రకటిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల్ -2 ఉద్యమం పేరిట శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత మంగళగిరి సీతారామ కోవెల వద్ద ప్రారంభమై ఈద్గా కమ్యూనిటీ హాలుకు చేరింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో కేసన శంకరరావు మాట్లాడుతూ నూటికి 80 శాతం పైగా బహుజనులకు సరియైె ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 25 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, నాయకులు శివరాం బాబాజీ, కాగితాల స్వాతి, అన్నం నాగబాబు, పి.దుర్గా ప్రసాద్, కార్యదర్శి వాకా మాధవరావు, అప్పికట్ల శ్రీహరి నాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: ఉగాది నాటికి జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీడీవోల పర్యవేక్షణలో గృహ నిర్మాణ శాఖాధికారులు సమన్వయం చేసుకొని లబ్ధిదారులతో మమేకమై నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. మరమ్మతులకు గురైన రోడ్ల జాబితా తయారు చేసి అందించాలని, అభివృద్ధి పనులు ఎక్కడైనా నిలిచిపోతే వాటి వివరాలు అందజేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి బోర్లు, పైపులైన్ల మరమ్మతులు చేయడంతో పాటు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ర్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖాధికారులు, ఈఓఆర్డీలు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ ఆలయ వార్షికోత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలోని గంగానమ్మ, పోతురాజు ఆలయ 17వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గంగానమ్మ, పోతురాజులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి యేళ్ల సాంబశివరావు పర్యవేక్షించారు.

ఘనంగా మల్లేశ్వరుని పెండ్లి కుమారుడి ఉత్సవం



పెండ్లికుమారుడైన స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మంగళగిరి: నగరంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి వారు పెండ్లి కుమారుని ఉత్సవం ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన జంజనం లక్ష్మీ నారాయణ జ్ఞాపకార్థం కుమారులు నాగేంద్రరావు, శ్రీనివాసరావు, జంజనం మస్తాన్ స్వామికి మధుపర్కములు సమర్పించారు. పెండ్లి కుమారుడైన మల్లేశ్వరస్వామి వార్లను భక్తులు కనులారా తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే రోజు రాత్రి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటర్‌కు చేరింది. తిరిగి అక్కడి నుంచి కోనేరు మీదుగా దేవస్థానం వరకు నిర్వహించారు. ఆయా కూడళ్లలో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

మదర్సాల్లోని విద్యార్థులను పాఠశాలల్లో నమోదు చేయాలి

సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, ఖాసీం

గుంటూరు ఎడ్యుకేషన్: మదర్సాల్లో చదువుతున్న విద్యార్థుల్ని ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా నమోదు చేయాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని సమగ్ర శిక్ష విభాగంలో శుక్రవారం జిల్లాలోని మదర్సాల ప్రతినిధులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2,989 మంది బాలలు బడిబయట ఉన్నట్లు గుర్తించగా, ప్రభుత్వ ఆదేశాలతో సంబంధిత బాలల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించామని చెప్పారు. వీరిలో 430 మందిని గుర్తించి, పాఠశాలల్లో చేర్పించామని తెలిపారు. మిగిలిన వారిలో ఎక్కువ మంది వేర్వేరు ప్రాంతాలకు వలసలు వెళ్లినట్లు గుర్తించామని పేర్కొన్నారు. కొంత మంది విద్యార్థులు దూరవిద్య టెన్త్‌లో ప్రవేశం పొందారని తెలిపారు. మదర్సాల్లో చదువుతున్న బాలల్లో ఎక్కువ మంది యూడైజ్ డేటాలో నమోదు కాకపోవడంతో వారిని బడి బయట పిల్లలుగా పరిగణించాల్సి వస్తోందన్నారు. మదర్సాల్లోని బాలబాలికలందర్నీ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా నమోదు చేయించాలని నిర్వాహకుల్ని ఆదేశించారు. సమావేశంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం పాల్గొన్నారు.

ఆశ వర్కర్ మృతి కారకులను శిక్షించాలి

ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

తాడేపల్లి రూరల్: ఆశ వర్కర్ మృతి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి కోరారు. వడ్డేశ్వరం బైపాస్‌రోడ్‌లోని కేబీ భవన్‌లో సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆమె పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పించి చదువు చెప్పించాలని విన్నవించారు. ప్రభుత్వం వారు ప్రకటించిన రెండు ఎకరాల భూమిని వారి కుటుంబానికి తక్షణమే అందజేయాలని కోరారు. అనంతరం సంఘం తరపున బాధిత కుటుంబ సభ్యులకు రూ.1,50,000 ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి కమల, సౌభాగ్యం, పి.ధనశ్రీ, రాఘవమ్మ, సుధారాణి, అన్నపూర్ణ, పద్మ, శివకుమారి పాల్గొన్నారు.

స్థిరమైన లక్ష్యంతోనే జీవితంలో ఉన్నతస్థాయి

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు స్థిరమైన లక్ష్యం ఉండాలని ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్ రెడ్డి సూచించారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శామ్యూల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో భావి జీవితానికి పునాదులు వేసుకోవాలని సూచించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ సంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనందబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాల ఉద్యోగ సంఘ నాయకుడు మద్దు జ్యోతిబాబు, ఎన్.శరత్ చంద్రబోస్, అంజిరెడ్డి, సీహెచ్.ఎస్.ఎస్. మూర్తి, షేక్ మీరావలి, కె.చంద్రిక, విజయలక్ష్మి, సీహెచ్. కిశోర్‌బాబు పాల్గొన్నారు

ఉన్నత విద్యకు పునాది ఇంటర్మీడియెట్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నత చదువులతో జీవితంలో నిర్దేశించుకున్న రంగాల్లో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఇంటర్మీడియెట్ విద్య కీలకమైనదని కళాశాల విద్య ఆర్జేడీ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ విద్యార్థినులు తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా అనుకున్న లక్ష్యాల్ని సాధించాలని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత మాట్లాడుతూ వెయ్యి మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో విద్య, ఎన్ఎస్ఎస్, సాంస్కృతిక, క్రీడా రంగాలల్లో గుర్తింపు పొందుతూ కళాశాల స్థాయిని ఇనుమడింప చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ అధ్యాపకులు సిహెచ్.పద్మావతి, బి.జె.షీలా, కె.శ్రీనివాసరావు, బి.మరియదాసు మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని కల్యాణి బుక్‌హౌస్ వారితో పాటు అధ్యాపకులు ప్రతిభావంతులైన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.